## ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదంచేయండి: ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆధునికరించిన ఎన్టీఆర్ విగ్రహం ప్రారంభోత్స వం, వర్ధంతి సభ నిర్వహణ ఏర్పాట్లుపై దామచర్ల జనార్దన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ నేడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా అద్దంకి బస్స్టాండ్ నందు ఎన్టీఆర్ విగ్రహం ప్రారంభోత్స వం, వర్ధంతి ఘనంగా నిర్వహించాలన్నారు. అందరూ ఈ కార్యక్రమం లో భాగస్వాములు అయ్యేలా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. పార్టీ కార్యాలయం నందు జరుగుతున్న ఏర్పాట్లుపై పరిశీలించడం జరిగినది. రక్తదాన శిబిరం, అన్నద్నాన కార్యక్రమం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్ని కమిటీల వారికి సూచించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వర్ధంతి కమిటీ వారు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు

## నిధులు లేక విలవిల్లాడుతున్న పంచాయతీలు

- పన్నుల వసూళ్లలో వెనుకబాటు, జమకాని ఆర్థిక సంఘం నిధులు
- సర్పంచ్‌ల సంఘం వీరభద్రాచారి

**ఒంగోలు, ప్రభాతవార్త**



రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు కనీస వసతుల కల్పనకు నిధులు లేక విలవిల్లాడుతున్నాయని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జి.వీరభద్రాచారి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మరో రెండు మాసాల్లో ఆర్థిక సంవత్స రం పూర్తవుతుందని అయినప్పటికి నేటి వరకు ఇంటి పన్నుల వసూళ్లలో ఎలాంటి పురోగతి లేదన్నారు. పారిశుద్యం నిర్వహణతో పాటు కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని దశలో ఉన్నాయని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ఖాతాలకు జమ కావడం లేదన్నారు. తక్షణమే ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లసంఘం జిల్లా పంచాయతీ అధికారులను కోరుతున్నట్లు వీరభద్రాచారి తెలిపారు. కొన్ని గ్రామ పంచాయతీలలో పన్ను కొంత మేర వసూళ్లు అయినప్పటికి జమ చేయకుండా దుర్వినియోగం అవుతున్న తీరుపై ప్రత్యేక నిఘా ఉంచాలని అన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం కూడా మరో రెండు నెలల్లో ముగిసిపోతున్న నేపధ్యంలో ప్రభుత్వం చేసిన పనులకు నిధులు విడుదల చేయాలని, అలాగే గౌరవ వేతనం తాలూకు బకాయిలు నేటి వరకు వెంటనే చెల్లించాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ని కోరుతున్నట్లు వీరభద్రాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాండు రంగారావు, ప్రజ్యోత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఖైదీలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రక్రియ

- సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్

**ఒంగోలు, ప్రభాతవార్త**



జిల్లా జైలులో న్యాయవాదిని నియమించుకోలేని ఖైదీలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అనే ప్రక్రియ ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అవసరం ఉన్న ప్రతి ఖైదీ వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ న్యాయ మూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు.శనివారం జిల్లా జైలును సందర్శించిన న్యాయమూర్తి అక్కడ ఖైదీలకు అందుతున్న వసతి మరియు భోజన సదుపాయాలను తనిఖీ చేశారు. అదేవిధంగా ఖైదీలకు చట్టపరంగా అందుతున్న అవకాశాలను వివరించారు. క్షణికావేశంలో తప్పులు చేయటం వల్ల తమ యొక్క అమూల్యమైన జీవితాన్ని వృధా చేసుకోవడమే కాకుండా తమ కుటుంబ సభ్యులకు దూరంగా ఉండటం వలన ఎంతో మానసికంగా క్షోభ అనుభవిస్తున్నారని భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి పి వరుణ రెడ్డి లీగల్ ఎయిడ్ న్యాయవాదులు. రవిశంకర్, వీర రాఘవులు డిప్యూటీ జైలర్. ఎలమందరావు, డాక్టర్ బ్రహ్మతేజ పాల్గొన్నారు.

## ఓఎం ఏపీ రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో ఎంపి మాగుంట సన్మానం

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఓఎం ఏపీ రైల్వే సాధన సమితి వారి ఆధ్వర్యంలో ఒంగోలులోని ఎంపీ మాగుంటి శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయంలో వారిని కలిసి. శాలువాతో ఘనంగా సత్కరించి బొకే అందజేశారు. పిడుగురాళ్ల అద్దంకి మద్దిపాడు ఒంగోలు. నూతన రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. వారు వెంటనే స్పందించి దరిశి అద్దంకి ఒంగోలు. రామాయపట్నం పోర్టుకు కనెక్టెడ్ ఉంటే బాగుంటుంది. ఈ విషయం గురించి రేపుపార్లమెంటులో మాట్లాడి రైల్వే మంత్రికి రిపోర్ట్ ఇస్తానని.హామీ ఇచ్చారు. కమిటీ సభ్యులు బచ్చల వాసు. శేషగిరి నాయుడు. కలుమూరి అనిల్ కుమార్. కనిగండ్ల వెంకటేశ్వర్లు. చెన్నుపల్లి శ్రీనివాస చారి. మోతదుగు వెంకటేశ్వరరావు. కే.మోలాలిమి త్తంతి ప్రసాదు. కొమరోలు హనుమా కాకర్ల శ్రీను. బూదాటి వాసు. రవితేజ. సామేలు సభ్యులు ఉన్నారు.

## కొత్త పాస్ పుస్తకాలు ఏర్పాట్లు: తాసిల్దార్ పి.సింగారావు

**జె. పంగులూరు, జనవరి 17, ప్రభాతవార్త**



ఫిబ్రవరి 9వ తేదీ నుండి కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ ప్రారంభమవుతుందని తాసిల్దార్ సింగారావు అన్నారు. మండలం లోని కశ్యాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ ధూళిపాళ వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో తప్పులు లేకుండా కొత్త పట్టాదారు పాస్ పుస్తకములు మంజూరు చేయుటకు గాను గ్రామంలోనే రెవెన్యూ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మండల తాసిల్దార్ పి.సింగారావు శనివారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్యాపురం గ్రామంలో గతంలో రీ సర్వే నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయలేదన్నారు. ఫిబ్రవరి 9వ తేదీన ఈ గ్రామంలో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తప్పులు లేకుండా కొత్త పట్టాదారు పాస్ పుస్తకములు మంజూరు చేయుటకు గ్రామము లోనే రెవిన్యూ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. రైతులందరూ తమ వివరములు పరిశీలించుకొని, ఆధార్, ఫోన్ నెంబర్, కులము ధ్రువీకరణ వంటి వాటిని అక్కడికక్కడే సరిచేయ దం జరుగుతుందని, 9 వ తారీకు నుండి కొత్త పట్టాదారు పాస్ పుస్తకములు పంపిణీ ప్రారంభః అవుతుందని, గ్రామంలో మొత్తం 463 మంది రైతులు ఉన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ అర్జున్, ఆర్ఐ శ్వేత, వి.ఆర్.ఒ సుమతి రెవిన్యూ సిబ్బంది ఆ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 23న మండల సర్వసభ్య సమావేశం

**ఉలవపాడు జనవరి 17 ప్రభాతవార్త**

ఈనెల 23న మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, పంచాయతీ సర్పంచులు, జడ్పిటిసి, ప్రభుత్వ అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

## కోర్టులో పలు ఉద్యోగాలకు దరఖాస్తు ఆహ్వానం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి సూచన మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, ఒంగోలు నందు పనిచేయుటకు రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలు 3, ఫ్రంట్ ఆఫీస్, కోఆర్డినేటర్ 1, డేటా ఎంట్రీ ఆపరేటర్1 రెగ్యులర్ పద్ధతిలో నియామకాలు దరఖాస్తు ఆహ్వానించడం జరుగుతుంది అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ న్యాయ మూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఓసి క్యాటగిరీకి రెండు ఎస్సీ కేటగిరి లోని గ్రూపు 1 ఒక ఉద్యోగం కేటాయించబడినయని వీటికి విద్యా అర్హతగా పదవ తరగతి లేదా తత్సమానమైన పరీక్షలు ఉత్తీర్ణత పొంది ఉండాలని అదేవిధంగా ఫ్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ మరియు డేటా ఎంట్రీ ఉద్యోగులను ఓసి క్యాటగిరిలో భర్తీ చేయడం జరుగుతుందని వీటికి విద్యార్హతగా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానం టైపింగ్ నాలెడ్జ్ కలిగి ఉండాలని డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి అదనంగా ఆఫీస్ నందు మూడు సంవత్సరాల అను భవం కలిగి ఉండాలని తెలిపారు. జనవరి 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు లోపు దరఖాస్తులను రిజిస్టర్ పోస్టు ద్వారా గాని స్పీడ్ పోస్ట్ ద్వారాగాని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఒంగోలు వారి కార్యాలయానికి అందే విధంగా పంపాలని సమయందాటిన అప్లికేషన్లు తిరస్కరించబడతాయన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## రికార్డు రూమును పరిశీలించిన డిఆర్ఓ ఓబులేసు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు కలెక్టరేట్‌లోని రికార్డు రూమును జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు శనివారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇటీవల జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రకాశం జిల్లా నుండి నూతనంగా మార్కాపురం జిల్లా ఏర్పడినందున, మార్కాపురం జిల్లాకు సంబంధించిన రికార్డులను సదరు జిల్లాకు పంపుటలో భాగంగా రికార్డుల విభజన ప్రక్రియను జిల్లా రెవెన్యూ అధికారి, సంబంధిత సెక్షన్ అధికారులతో కలసి పరిశీలించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంట కలెక్టరేట్ ఎఓ టి రవి, సంబంధిత సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి గేట్లు ఓపెన్.. వారందరికి వెల్ కమ్

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఏపీలో కూటమి పాలన నెమ్మదిగా రెండేళ్ళకు చేరువ కావస్తోంది. ఇక పాలన మీద జనాలు తమ ఒపీనియన్‌ను ఓపెన్‌గా రైజ్ చేసే టైమ్ కూడా స్టార్ట్ అవుతున్న నేపధ్యం ఇదే. మరో వైపు చూస్తే వైసీపీ కూడా 2026 కొత్త ఏడాదిలో తన రాజకీయ యాక్షన్ ప్లాన్‌ని సిద్ధం చేసుకుంటోంది. అయితే ఓటమి తరువాత వైసీఎ అయితే పెద్దగా కార్యక్రమాలు చేసినది లేదు. అధినేత జగన్ కూడా జనంలోకి వచ్చినది లేదు. కానీ ఇక మీదట వైసీపీ వెళ్లాలని చూస్తోంది. అయితే వైసీపీ జనంలోకి వెళ్ళి బలపడ కుండా ఎత్తులు పై ఎత్తులు వేసేందుకు కూటమి గట్టిగానే స్కెచ్ గీస్తోంది. 2029 లోనూ గెలవాలని చూస్తోంది. అంతే కాదు ఏకంగా 15 ఏళ్ళ పాటు ఏపీలో కూటమి పాలన సాగాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనేక సార్లు చెబు తూ వచ్చారు. అయితే ఇవి కేవలం మాటలు కాదు ఇప్పుడు చేతలకు టీడీపీ కూటమి దిగుతోంది అని అంటున్నారు.

**వైసీపీ వీక్ కావాల్సిందే:**

వైసీపీని ఎట్టి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో మరో సారి అధికారంలోకి రానీయకుండా వీక్ చేయాలని కూటమిలో ప్రధాన పార్టీలు అయిన టీడీపీ, జనసేన డిసైడ్ అయ్యాయని అంటున్నారు. ఇందు కోసం తగిన రాజకీయ ప్రణాళికను సిద్ధం చేసినట్లుగా చెబుతున్నారు. దీని ప్రకారం పార్టీలు ఎవాఇనా కానీ నాయకులు మంచిగా ఉంటే చాలు, వారు వివాదరహితంగా ఉంటూ ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన ఉంటే కనుక వారిని చేర్చుకోవడానికి టీడీపీ జనసేన సిద్ధం అవుతున్నాయని చెబుతున్నారు. వైసీపీలో బలమైన నాయకులు అనేక మంది ఉన్నారు. వారిని టార్గెట్ చేశారు అని అంటున్నారు.

**సైలెంట్‌గా ఉన్న వారికిః**

ఇక పేరుకు వైసీపీలో ఉన్నా కూడా ఆ పార్టీలో సైలెంట్‌గానే అనేక మంది ఉన్నారు. వారు సొంత పార్టీ తీరు పట్ల కొంత అసంతృప్తిగా ఉన్నారని చెబుతున్నారు. అదే సమయంలో తమ రాజకీయ జీవితం మీద కూడా వారు ఆందోళన చెందుతున్నట్లుగా చెబుతున్నారు. ఇలాంటి వారి విషయంలో టీడీపీ, జనసేన టార్గెట్ చేసి మరీ చేర్చుకునేందుకు పావులు కదుపుతున్నాయని అంటున్నారు. ప్రజలలో పలుకుబడి ఉండి పని చేసే తత్వం ఉన్న వారిని చేర్చుకుంటే కూటమి ఒక వైపు మరింతగా బలపడుతుందని అదే సమయంలో వైసీపీ వీక్ అవుతుందని ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. దీంతో వైసీపీలో ఈ తరహా నేతల లిస్ట్ ప్రిపేర్ చేస్తూ ఎవరికి వారుగా చేర్చుకునేందుకు టీడీపీ, జనసేన పక్కా ప్లాన్‌తో ముందుకు సాగుతున్నాయని అంటున్నారు.

**వైసీపీ రాకుండానేః**

వైసీపీ ఇప్పుడు విపక్షంలో ఉంది. ఆ పార్టీ ఏజ్ 15 ఏళ్ళు, గతంలో బలమైన ప్రతిపక్షంగా ఉంది, ఆ తరువాత అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు చూస్తే విపక్షంలో 11 సీట్లు సాధించినా 40 శాతం ఓటు షేర్ దక్కించుకుంది. దాంతో వైసీపీ మళ్ళీ అధికారంలోకి తప్పకుండా వస్తామని అంటోంది. అయితే ఆ చాన్స్ వైసీపీ ఇవ్వకూడదు అంటే భాగా వీక్ చేయాలన్నది కూటమి పార్టీల రాజకీయ మంత్రాంగంగా ఉంటుందని అంటున్నారు.

**వారికి కండువాలతోః**

వైసీపీ నుంచి వచ్చే నాయకులకు స్వాగతం పలకాలన్నది సూత్రప్రాయంగా నిర్ణయించారు అని అంటున్నారు. రాజకీయంగా వైసీపీని ఈ విధంగా దెబ్బతీయాలని కూడా ఆలోచిస్తున్నారు. అందుకే ఏ ప్రాంతం అని కానీ ఏ నియోజక వర్గం అని కానీ ఏ జిల్లా అని కానీ చూడకుండా బెస్ట్ లీడర్ జనంలో ఎంతో కొంత పేరుంది అని కనుక రిపోర్టు ఉంటే చాలు వారికి ఎర్ర తివాచీ పరచి వెల్కం చెబుతారు అని అంటున్నారు. ఇది ఒక విధంగా వైసీపీలో అసంతృప్తిగా ఉన్న నేతలకు మంచి అవకాశంగా చెబుతున్నారు. అయితే వైసీపీకి మాత్రం అగ్ని పరీక్షగా పేర్కొంటున్నారు. ఈ భారీ రాజకీయ సవాల్ కూటమి నుంచి ఎదురైతే వైసీపీ ఎలా తట్టుకుంటుంది అన్నది కూడా పెద్ద చర్చగా ఉంది.

**న్యూట్రల్ లీడర్స్‌తోః**

అంతే కాదు ఏ రాజకీయ పార్టీకి చెందని న్యూట్రల్ లీడర్స్‌ని కూడా తమ పార్టీలలో చేర్చుకోవడం ద్వారా వైసీపీ గ్రాఫ్ ఏ మాత్రం పెరగకుండా చెక్ పెట్టాలని టీడీపీ, జనసేన వ్యూహ రచన చేస్తున్నాయని అంటున్నారు. ఎన్నికలు చూస్తే ఇంకా మూడేళ్ళకు పై దాటి ఉన్నాయి కానీ ఇప్పటి నుంచే తమ పొలిటికల్ యాక్షన్ అమలు చేయాలని కూటమి పార్టీలు డిసైడ్ కావడం అయితే రాజకీయంగా ప్రకంపనలు రేపేలా ఉందనే అంటున్నారు.

### దళిత ద్రోహి చంద్రబాబు..

# కూటమి ప్రభుత్వం కుట్రల ప్రభుత్వం..

- సనాతనం పేరుతో వేశం వేసిన పవన్ కళ్యాణ్ - ఎర్ర బుక్కు అనే ఎర్రి పరిపాలన చేస్తున్న కూటమి

**యర్రగొండపాలెం రూరల్, జనవరి 17, ప్రభాతవార్త**



రాష్ట్రం లో దళితుల పట్ల అన్యాయాలు, అక్రమాలు జరుగుతుంటే ఏమి తెలియనట్టు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. యర్రగొండపాలెంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే చంద్రశేఖర్ కూటమి ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టారు. దళిత మహిళలకు తీరని అన్యాయం జరుగుతుంటే ఉలుకు పలుకు లేకుండా ఉండటం దారుణమని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం ప్రజల పట్ల కుట్రపూరితమైన పరిపాలన చేస్తుందని ధ్వజమెత్తారు. ఎర్ర బుక్క అనే పేరుతో ఎర్రి పరిపాలన చేస్తున్నారని ఎద్దేవ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో దాడులు పలు అక్రమ కేసులతో విధ్వంసక పాలన నడుస్తుందని ఎమ్మెల్యే చంద్రశేఖర రావు ఆగ్రహం వ్యక్తం చేశాడు. గత ఎన్నికల్లో అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నిలువున ముంచాడని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలో ప్రజలపై దాడులు, అక్రమ కేసులు, అవినీతి అరాచకాలు తప్ప రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు.రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలు కచ్చితంగా కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని ఆయన మండిపడ్డారు. ఈ సమావేశంలో ఎర్రగొండపాలెం మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి. సర్పంచి అరుణ భాయ్. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒంగోలు మూర్తి రెడ్డి. ఎంపీపీ దొంతా కిరణ్ గౌడ్. జడ్పిటిసి విజయభాస్కర్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీ సింగా ప్రసాద్. మాజీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్ రెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనాభా లెక్కల పక్రియకు చర్యలు

- కలెక్టర్ పి.రాజాబాబు

**ఒంగోలు, ప్రభాతవార్త**



అధికారికంగా జనాభా లెక్కల ప్రక్రియను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలపై దృష్టి పెట్టినట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ (ఇన్‌చార్జి), సెన్సస్ డైరక్టర్ నివాస్ మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల



కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటికే చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు జనాభా గణనపై ఆరా తీయడంతో పాటు పూర్తి స్థాయిలో జనాభా లెక్కలు కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంపై పలు సూచనలు చేశారు. ఈసారి జనాభా లెక్కలను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, జియో మ్యాపింగ్ ఆధారంగా చేపట్టనున్నందున జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజన జరిగినందున వాటి సరిహద్దులను నిర్ధారించడంతో పాటు సంబంధిత మ్యాప్‌ను ఈనెల 20వ తేదీ నాటికి ఢిల్లీ పంపించాలని చెప్పారు. జన గణన కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అనుసరించాల్సిన పక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నివాస్ వివరించారు. కాగా, ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ఉద్యోగుల ప్రమోషన్ల పక్రియను కూడా ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని రావత్ చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్ఓ బి.చిన ఓబులేసు, ప్రకాశం, మార్కాపురం జిల్లాలోని ఆర్డీవోలు, మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

# సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేద్దాం: బూచేపల్లి

**చీమకుర్తి, జనవరి 17, ప్రభాతవార్త**



గ్రామస్థాయి నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతంగా ముందుకు సాగాలని జిల్లా వైయస్సార్ పార్టీ అధ్యక్షులు, దరిశి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. చీమకుర్తి పట్టణం లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మండల గ్రామ కమిటీ అధ్యక్షులతో, నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు వైసిపి ఇన్చార్జ్, మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, జడ్పీ చైర్మన్ వెంకాయమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ గ్రామ కమిటీలను, అనుబంధ కమిటీలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, సంతనూతలపాడు నియోజకవర్గంలో డాక్టర్ మేరుగు నాగార్జున ని ఎమ్మెల్యేగా చేసుకోవాల్సి న బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. దీని కొరకు గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసే దిశగా గ్రామ అనుబంధ కమిటీలను వేయాలని, ఈ కమిటీలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని చీమకుర్తి మండల వైయస్సార్ సిపి నాయకులను గ్రామ పార్టీ అధ్యక్షులను కోరారు. మాజీ మంత్రివర్యులు సంతనూతలపాడు నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ మేరుగు నాగార్జున మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త బూచేపల్లి సారధ్యంలో పార్టీని బలోపేతం చేయాలని చేద్దామని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి మున్సిపల్ చైర్పర్స న్ గోపురపు రాజలక్ష్మీ పూర్ణచంద్రరావు, మరియు మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, వైఎస్ఆర్సిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నేడు జిల్లా వ్యాప్తంగా వైసీపీ నిరసనలు

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ కక్షలు ముదిరిపోతున్నాయని వైసీపీ ఆరోపిస్తుంది. పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ దళిత కార్యకర్త మందా సాల్మన్ హత్యకు నిరసనగా శనివారం జిల్లా వ్యాప్తంగా వైసీపీ శ్రేణులు ఆందోళనకు దిగారు. జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఒంగోలులోని అంబేద్కర్ భవనం నుండి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న తన భార్యను చూసేందుకు గ్రామానికి వచ్చిన సాల్మన్‌పై టీడీపీ నాయకులు ఇనుపరాడ్లతో దాడి చేసి అత్యంత కిరాతకంగా హతమార్చారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి విపక్ష కార్యకర్తలపై దాడులు, హత్యలు నిత్యకృత్యమయ్యాయని వారు ధ్వజమెత్తారు. సాల్మన్ హత్య వెనుక స్థానిక అధికార పార్టీ నేతల హస్తం ఉందని, పోలీసు వ్యవస్థ కూడా నిందితులకు ఒత్తాసు పలుకుతుందని విమర్శించారు. బాధితుడు కోమాలో ఉన్న సమయంలోనే అతనిపై తప్పుడు కేసులు పెట్టడం దారుణమని, హంతకులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. దళిత నేత సాల్మన్‌కు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని పార్టీ ప్రతినిధులు స్పష్టం చేశారు. బాధితుల కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందని భరోసా ఇస్తూ అంబేద్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవప్రసాద్, రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి బొట్ల రామారావు, రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వైఎం ప్రసాద్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, జిల్లా విద్యార్థి సంఘం విభాగం అధ్యక్షులు పల్నాటి రవీంద్రరెడ్డి, వైసీపీ నాయకులు దుంపా చెంచిరెడ్డి, దుంపా యలమందారెడ్డి, తాతా నర్సింగ్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు బడుగు ఇందిరా, బత్తుల ప్రమీల, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరపల్లి రమణయ్య, పసుమర్తి గోపిచంద్, వినోద్, ఉన్నం జనార్ధన్, మేళం గురవయ్య, టి.కరుణాకర్, ప్రతాప్, వీశం బాలకృష్ణయ్య, పీటర్, యోహాను, ఝాన్సీ, కొమ్ము సామ్యేల్, వెంకయ్యనాయుడు, జిల్లా ఎస్సీ నాయకులు కర్యకర్తలు, పాల్గొన్నారు.

## బల్లికురవలో డాక్టర్ అశోక్ కుమార్ పరామర్శలు, పలకరింతలు





**బల్లికురవ, జనవరి 17, ప్రభాతవార్త**
మండలంలోని పలు గ్రామాలలో శనివారం అద్దంకి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రమాదాలలో గాయపడిన వారిని పరామర్శించడంతో పాటు, అనారోగ్యంతో మృతి చెందిన కార్యకర్తల కుటుంబ సభ్యులను పలకరించి ఓదార్చారు. అనారోగ్యాలతో మంచాలకే పరిమితమైన కార్యకర్తల నాడి పట్టి, వారిలో ధైర్యం నింపారు. ముందుగా మండలం గుంటుపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గోరంట్ల శివన్నారాయణని పరామర్శించి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అనంతరం కొత్తపాలెం గ్రామంలో గ్రానైట్ క్వారీ ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మాలపాటి హనుమంతరావును పరామర్శించి వైద్య పరీక్షల దస్త్రాలను పరిశీలించారు. కొత్తపాలెం గ్రామంలోనే అనారోగ్యంతో బాధపడుతున్న తాటికొండ మోహన్‌రావును పరామర్శించి, ధైర్యం చెప్పారు. కొత్తపాలెం గ్రామంలోనే ఇటీవల అనారోగ్యంతో మరణించిన తానికొండ పేరయ్య చిత్ర పటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంట మండల వైకాపా కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, మద్దినేని అవోక్, ఎస్కే అంజిబాబు, మైనార్టీ సెల్ నాయకులు ఖాదర్ సాహెబ్, శ్రీనువలి, మీరావలి, మాదాల శ్రీమన్నారాయణ, నాగేశ్వరరావు, చల్లగుండ్ల వీరాంజనేయులు, మాలపాటి ఆదిబాబు, దూళిపాళ్ల విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

**- బీట్ ఆఫీసర్ రమేష్ బాబు**



**బల్లికురవ, జనవరి 17, ప్రభాతవార్త**
పక్షులను, వన్యప్రాణులను వేటాడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కూకట్లపల్లి అటవీ బీట్ అధికారి కే.రమేష్‌బాబు హెచ్చరించారు. శనివారం మండలంలోని కొప్పెరపాడు చెరువు కట్టపై నుండి పక్షులను వేటాడేందుకు ప్రయత్నిస్తున్న చేపల పెంపకం దారులను హెచ్చరించారు. కుందేళ్లు, అడవి పందులు, తాబేలు, జింకలు, పక్షులను వేటాడటం తీవ్ర నేరంగా పరిగణించబడుతుందన్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం నాన్‌బైబుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. పక్షులు, పందుల కారణంగా నష్టం జరుగుతుంటే వాటిని బెదిరించి తోలాలే తప్ప, పంట చుట్టు విద్యుత్ కంచె ఏర్పాటు చేసి, పందులను చంపటం అటవీ చట్టంలో కఠిన నేరంగా పరిగణించబడుతుందన్నారు.

## అన్న క్యాంటీన్ పనులను వేగవంతం చేయాలి

**- నాగరాజుపల్లెలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు స్థలం పరిశీలన**

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్**




**మార్టూరు, జనవరి 17, ప్రభాతవార్త**
అన్న క్యాంటీన్ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. శనివారం మార్టూరు నగరం, సంపత్ నగర్లో చివరి దశకు చేరుకున్న అన్న క్యాంటీన్ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి, కార్మిక వర్గ ప్రజలకు, చిరు ఉద్యోగులకు నాణ్యమైన పరిశుభ్రమైన, పౌష్టికాహారాన్ని అతి తక్కువ ధరకే అందించాలనే సంకల్పంతో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తుందని ఆయన చెప్పారు. మార్టూరు నగరం, సంపత్ నగర్‌లోని సర్వే నెంబరు 600/సిలోని 30 సెంట్లు కమ్యూనిటీ స్థలంలో అన్న క్యాంటీన్ కొరకు 5 సెంట్ల స్థలాన్ని కేటాయించి పనులు చేపట్టడమైందని, పనులు చివరి దశకు చేరుకున్నాయని ఆయన తెలిపారు. ఈ అన్న క్యాంటీన్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానం ద్వారా త్వరలో ప్రారంభిస్తారని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుపై నగర ప్రజల స్పందనను ఆయన తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్ పక్కనే ఉన్న పరిసరాలను ఆయన పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు మార్టూరు మండలం నాగరాజుపల్లెలో నిర్ధేశించిన స్థలంను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పరిశీలించారు. నాగరాజుపల్లెలోని సర్వే నెంబరు 445, 453, 476లోని 85 ఎకరాల అసైన్మెంట్ భూమిని ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు నిర్ధేశించినట్లు ఆ స్థలాన్ని మ్యాప్ ద్వారా మార్టూరు తహసీల్దార్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ముందుగా నిర్ధేశించిన సర్వే నెంబర 475 లోని 53 ఎకరాల ప్రభుత్వ కొండ పోరంబోకు స్థలాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు. ఆ స్థల వివరాలను మ్యాప్ ద్వారా తహసీల్దార్ కలెక్టర్‌కు వివరించారు. మొదటగా ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు నిర్ధేశించిన ఈ స్థలాన్ని కాకుండా మరొక స్థలాన్ని ప్రతిపాదనకు గల కారణాలపై జిల్లా కలెక్టర్ తహసీల్దార్‌ని ఆరా తీశారు. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు మొదటగా నిర్ధేశించిన సర్వే నెంబరు 475, రెండో సారి నిర్ధేశించిన సర్వే నెంబరు 445, 453, 476లలో ఏ ప్రదేశంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు సాధ్య సాధ్యం పరిశీలించి నివేదిక తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి, మార్టూరు తహసీల్దార్‌లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, మార్టూరు తహసీల్దార్ ప్రశాంతి, మండల సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

## టెండర్ ఒకరిది.. పనులు చేసింది మరొకరు

**- జీఎస్టీ చెల్లింపు పంపకాల వద్ద పేచి - బిల్లులు కాంట్రాక్టర్ ఖాతాలో**

**- దోర్నాలలో పునాదులతో నిలిచిపోయిన శ్రీశైల దేవస్థానం కళ్యాణ మండపం**



**పెద్దదోర్నాల, జనవరి 17, ప్రభాతవార్త**
దోర్నాల మండల కేంద్రంలోని శివసదనంలో శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించాల్సిన కళ్యాణ మండపం నిర్మాణం పనులు పునాదులతో ఆగిపోయాయి. ఈ పనులకు శ్రీశైలం దేవస్థానం కోటి98 లక్షల వ్యయ అంచనాలతో టెండర్ పిలిచింది. దోర్నాల మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్ ఆ పనులను లెస్‌తో సుమారు కోటి 85 లక్షలతో టెండర్ దక్కించుకున్నారు. ఆ పనిని సబ్ కాంట్రాక్టుగా ఇదే మండలానికి చెందిన మరో కాంట్రాక్టర్ తీసుకున్నారు. అంత వరకు భాగానే ఉంది. పునాదులు తవ్వి వాటిని పూడ్చి పిల్లర్లు నిలబెట్టారు. ఇందుకు గాను ఇంజనీరింగ్ అధికారులు 49.94 లక్షలు బిల్లులు మంజూరు చేసి 7.5 శాతం నిధులు తగ్గించి 37.54 లక్షల రూపాయలు కాంట్రాక్టర్‌కు చెల్లించారు. ఆ బిల్లులకు సంబంధించి జీఎస్టీ అమౌంట్ తను తీసుకొని మిగతా అమౌంట్ ఇస్తానని, లేదా ఇవ్వను అని కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్టర్‌కు మధ్య విభేధాలు తలెత్తాయి. ఇక అక్కడి నుండి పనులు నిలిచిపోయాయి. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి పనులు చేయించాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేశారన్న ధోరణి వినిపిస్తుంది. ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే కళ్యాణ మండపం నిర్మాణం గురించి పట్టించుకున్న నాథుడే లేడని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. శ్రీశైల దేవస్థానం అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. పునాది పనులకు బిల్లులు చేసి 11 నెలలు అవుతున్నప్పటికి పనులు నిలిచి కళ్యాణ మండపం పూర్తి కాకపోవడంతో భక్తులు స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శుభ కార్యాలకు సామూహిక కార్యక్రమాలకు ఉపయోగపడాల్సిన ఈ కళ్యాణ మండపం పునాదితో అర్ధాంతరంగా నిలిచిపోవడంతో దేవస్థానం ప్రతిష్టకు భంగం కలుగుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి టెండర్ పక్రియ, బిల్లుల చెల్లింపులు, పనుల నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కళ్యాణ మండపం పనులు వెంటనే చేపట్టే విధంగా చర్యలు తీసుకొని పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

**వివరణ :**
ఈ విషయమై శ్రీశైలం దేవస్థానం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నరసింహారెడ్డిని వివరణ కోరగా కళ్యాణ మండపం పనులు పునాదితో నిలిచిపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్‌కు నాలుగు పర్యాయాలు నోటీసులు ఇచ్చామని, దీంతో ఆఫీసుకు వచ్చి సంప్రదిస్తానని కాంట్రాక్టర్ చెప్పారని, అప్పటికి సదరు కాంట్రాక్టర్ స్పందించకపోయినా లేదా ప్రభుత్వ నిబంధనలు మేరకు కళ్యాణ మండపం పనులు చేపట్టకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

# 19న రాచర్లలో ప్రజాదర్బార్

**రాచర్ల, జనవరి 17, ప్రభాతవార్త**
రాచర్ల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 19వ తేదీ సోమవారం మధ్యాహ్నం 1:30 గంటలకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ప్రజా దర్బార్ కార్యక్రమం జరుగుతుందని మండల ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి శనివారం తెలిపారు. రాచర్ల కాల్వపల్లి, సత్యవోలు, సోమిదేవిపల్లి, గుడిమెట్ట, ఎడవల్లి, అనుమలవీడు సచివాలయాల పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సచివాలయ కార్యదర్శులు స్థానిక ప్రజలకు ప్రజా దర్బార్ గురించి తెలియజేసి ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎంపీటీసీలకు సమాచారం అందించి వారు కూడా కార్యక్రమానికి హాజరయ్యేలా సమాచారం అందించాలని తెలిపారు.

## మంత్రాలయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన నేతలు



**తాళ్లూరు, జనవరి 17,ప్రభాతవార్త**
కర్నూలు జిల్లా మంత్రాలయంలోని రామలింగేశ్వర స్వామిఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో కర్నూలు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు ఎస్ వీ మోహన్‌రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిలతో కలిసి ప్రకాశం జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ మాజీ సంయుక్త కార్యదర్శి ఐ వీ సుబ్బారెడ్డి, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు కైపు అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివశంకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకట్రావు తదితరులు పాల్గొని స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



## నిలిచిపోయిన మాలకొండస్వామి వేలంపాటల సొమ్ము

**- భారీగా నష్టపోయిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం**



గత ఏడాది వేలంపాటలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

**కందుకూరు జనవరి 17,ప్రభాతవార్త**
కందుకూరు నియోజవర్గంలోని మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారికి గత ఏడాది వేలంపాటదారులు నుంచి దాదాపు రూ.1.5కోట్లు నిలిచిపోయింది. ఈ మొత్తం వడ్డీతోపాటు దాదాపు 10నెలలుగా నిలిచిపోయింది. ఈ విషయంలో సంబందిత అధికారులు నిబంధనలు ఉల్లంఘించినట్లు ఆరోఫణలు ఉన్నాయి. దీంతో శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయం వడ్డీరాయితీని సైతం కోల్పోయింది. అధికారుల నిర్లక్ష్యం అశ్రద్ధ కారణంగా జరిగిన ఈ నష్టాన్ని సంబందిత అధికారుల నుంచి రాబట్టాలని పలువురు సూచిస్తున్నారు.

**వివరాల్లోకి వెళితే...**
2025-26 ఏడాదికి అనగా 2026 మార్చి 31వరకు స్వామివారికి భక్తులు సమర్పించు పలు ఐటమ్స్‌ను వసూలు చేయుటకు, మరియు ఆలయపరిధిలో షాపుల నిర్వహణకు 2025 ఫిబ్రవరిలో బహిరంగవేలం నిర్వహించారు. కొబ్బరి చిప్పలు, వస్త్రాలు, పార్కింగ్‌రుసుము వసూలు చేసుకోవడం, టెంకాయలు, ఫలహారశాల, ఫ్యాన్సీ, కూల్‌డ్రింక్స్ తదితర 12ఐటమ్స్ నిర్వహణకు ఆలయ అధికారులు కొండమీద బహిరంగవేలం వేశారు. ఈ వేలంలో పలువురు నామమాత్రపు డిపాజిట్‌తో పాటలో పాల్గొని షాపులను కైవసం చేసుకున్నారు. తద్వారా సుమారు రూ.4.17కోట్లు మేర ఆదాయం స్వామివారికి సమకూరింది. అయితే పాటలు పూర్తయిన వెంటనే 50శాతం, ఆ తరువాత సంబందిత ఉత్తర్వులు అందిన తరువాత మిగిలిన సొమ్ము ఆలయానికి జమచేయాల్సి ఉంది. అయినా ఈ చెల్లింపు ఎండమావిలా తయారైంది. 10నెలలు పూర్తవుతున్నా ఈనాటికి పూర్తిస్థాయిలో చెల్లించలేదు. సదరు ఉత్తర్వులు ఇవ్వలేదని పలువురు పాటదారులు ఆరోపిస్తున్నారు. సుమారు తలనీలాల సొమ్ముతోపాటు టెంకాయలుతోపాటు అన్ని రకాల ఐటమ్స్‌కి సంబందించి సొమ్ము బకాయి ఉంది. వేలంపాటలు పూర్తయిన వెంటనే మిగిలిన సొమ్మును చెల్లించాలని నిబందనల్లో పేర్కొన్నారు. చెల్లించని ఎడల సదరు డిపాజిట్‌ను ఆలయానికి జమచేసుకొని, తిరిగి వేలం నిర్వహిస్తామని తెలిపారు. అయితే మరో 2నెలల్లో గడువు ముగుస్తుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి మరలా కొత్తవారు రావాలి. ఇందుకోసం ఫిబ్రవరిలో బహిరంగ వేలం నిర్వహించాలి. అయినా గత ఏడాది పాటల సొమ్ము ఇంతవరకు పూర్తిస్థాయిలో ఆలయానికి జమకాకపోవడం పలువిమర్శలకు తావిస్తోంది. అధికారులు పలు ప్రలోభాలకు లోనయినట్లు ఆరోపణలు ఉన్నాయి. సకాలంలో చెల్లించిఉంటే స్వామివారికి భారీ మొత్తంలో వడ్డీ వచ్చేది. దీంతో ఆ వడ్డీ సైతం నిలిచిపోయింది. ఈ సొమ్మును సంబందిత అధికారులు నుంచి రాబట్టాలని పలువురు సూచిస్తున్నారు. ఈ విషయమై సంబందిత అధికారిని వివరణకోసం ప్రయత్నించగా పోన్ కలవలేదు.

# కూటమి ప్రభుత్వం అభివృద్ధి ప్రభుత్వం

**- దర్శిలో తిరిగి కూటమి జెండా ఎగుర వేయాలి - అభివృద్ధి ఉరుకులు తియ్యాలి**

**- యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం**

**- పలు అభివృద్ధి కార్యక్రమాలకి శంకుస్థాపనలు చేసిన మంత్రులు రవికుమార్, డాక్టర్ డోలా**




**ముండ్లమూరు, జనవరి 27, ప్రభాతవార్త**
రాష్ట్రంలో యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పించి పోలవరం ప్రాజెక్టుని పూర్తి చేసి, రాజధాని అమరావతిని పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వందేనని, కూటమి ప్రభుత్వం అభివృద్ధి ప్రభుత్వం అని, దర్శిలో తిరిగి కూటమి జెండా ఎగుర వేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం దర్శి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య అతిధులుగా విచ్చేసిన మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి యువతకి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. దర్శిలో నాలుగు కోట్ల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ డివిజనల్ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ముండ్లమూరు మండలంలోని ఉల్లగల్లు గ్రామంలో మూడు కోట్ల 90 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్‌కి భూమి పూజ చేశారు. ఐదు లక్షల రూపాయలతో నిర్మించిన మంచినీటి ట్యాంక్‌ని అలాగే స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం చేశారు. అనంతరం దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మ గౌరవం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగువారి ఆత్మ విశ్వాసాన్ని కాపాడటానికి ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నతమైన వ్యక్తి ఎన్టీఆర్ అని నేటికి ఆయన చనిపోయి 30 సంవత్సరాలు అయినప్పటికి తెలుగు వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ ఏ సాటి అన్నారు. మన 18 నెలల కూటమి పాలనలో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గుర్తుపాటి లక్ష్మీ సారధ్యంలో ప్రజా పాలన అభివృద్ధి పాలన నడుస్తుందన్నారు. పేదల సంక్షేమం కోసం కిలో రెండు రూపాయలు బియ్యాన్ని పక్కా ఇల్లు జనతా వస్త్రాలు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృష్ణ గోదావరి నదులను అనుసంధానం చేసి రైతులకు లాభాలు చేకూర్చే విధంగా చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ఇప్పటికి 40శాతం పూర్తి అయిందని రాష్ట్ర రాజధాని అమరావతిని కూడా పూర్తి చేస్తామని ఆయన అన్నారు. రాయలసీమలో ఫ్యాక్షను అంతరించినప్పటికి పల్నాడు జిల్లాలో ఫాక్షన్ నేటికి కొనసాగుతుందన్నారు. దర్శి నియోజకవర్గం 5 మండలాలని అద్దంకిలోని రెవెన్యూ డివిజన్లో కలపడం జరిగిందని, దర్శిని ప్రకాశం జిల్లాలో ఉంచడం జరిగిందని, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మికి ప్రజలు అండదండలుగా ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో వర్గ బేధాలు లేకుండా కలిసికట్టుగా పార్టీకి పని చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మహానాడుని జిల్లాలోని టీడీపీ నాయకులు కలిసికట్టుగా పని చేసే ఐదు లక్షల మందితో మహానాడుని దిగ్విజయం చేశారన్నారు. వ్యక్తిగత సమస్యలని పార్టీపై రుద్ది పార్టీకి నష్టం కలిగించొద్దన్నారు. అనంతరం మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ దర్శిలో 200 కోట్ల రూపాయల నిధులు తెచ్చిఅభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న గొట్టిపాటి లక్ష్మిని మంత్రి అభినందించారు. ఉల్లగల్లు గ్రామంలో మూడు కోట్ల 90 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్‌ని శంకుస్థాపన చేసి రూ.5లక్షల రూపాయలతో నిర్మించిన మంచినీటి ట్యాంకుని ప్రారంభించారు. అనంతరం ఎన్టీరామారావు విగ్రహాన్నిఆవిష్కరించారు. ఎన్టీఆర్ సంస్కరణలకు ఆధ్యుడని మండలాల వ్యవస్థనే తీసుకుని వచ్చి ప్రజలకి పాలనను దగ్గర చేశారన్నారు. రైతులకి న్యాయం చేశారని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. 600 లక్షల రూపాయలతోసంక్షేమ హాస్టల్‌ని కల్పించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మంత్రి నారా లోకేష్‌లు పేద ప్రజలకి ఐదు రూపాయలకే అన్న క్యాంటీన్ ద్వారా ప్రజలకు భోజనాలు పెడుతున్నారని, పెన్షన్‌లని ప్రతి నెలకి అందిస్తున్న ఘనత కూటమి పెరుగుతుందని అన్నారు. మహిళలకి ఉచితబస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకి తల్లికి వందనం పథకాన్ని కొనసాగిస్తూ దర్శిలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్‌ని పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వందే అన్నారు. అనంతరం మండలంలోని డ్వాక్రా మహిళలకు 274 గ్రూపులుకి సుమారు 27 కోట్ల రూపాయల డ్వాక్రా రుణాలను విడుదల చేశారు. అనంతరం ఆ పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దర్శిని అభివృద్ధి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం చేపట్టిందని, అందుకే ఎంపీగా తగిన నిధులు మంజూరు చేసి డాక్టర్ లక్ష్మీకి అండదండగా ఉంటానని ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, పవన్‌కళ్యాణ్‌లుప్రజాపాలన సాగిస్తున్నారన్నారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ మా బాబాయ్ గొట్టిపాటి రవికుమార్ విద్యుత్‌శాఖ మంత్రిగా ఉన్న ఈ సమయంలో గొట్టిపాటి వారసురాలుగా దర్శి ప్రాంత ప్రజల ప్రతినిధిగా విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా సబ్ స్టేషన్ ఏర్పాటు చేసుకోవడం డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం, సోలార్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడం ఇలా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నామని, ఎంతో ఆనందంగా ఉందని వలసలు నివారించే దిశగా ఉపాధి లక్ష్యంగా దొనకొండ ప్రాంతాన్ని పారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని డాక్టర్ లక్ష్మీ వివరించారు. నగర పంచాయతీగా ఉన్న దర్శి పట్టణాన్ని థర్డ్ గ్రేడ్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుకోగలిగామన్నారు. ఐదు కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. రోడ్లు, డ్రైన్లు మౌలిక సదుపాయల కల్పన ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలు చక చక పూర్తి చేసుకోగలుగుతున్నామన్నారు. తిరిగి దర్శిలో తెలుగుదేశం జెండా ఎగిరే దాకా అందరం కలిసి పని చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం కనిగిరి ఎమ్మెల్యే టీడీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, వై.పాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ కడియాల లలిత్‌సాగర్, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జనమాల నాగేంద్రం పిచ్చయ్య, బీజేపీ నాయకులు మాడపాకుల శ్రీనివాసరావు, తిండి నారాయణరెడ్డి, జనసేన నాయకులు తోట రామారావు, విద్యుత్ ఎస్ఈ కే.వెంకటేశ్వర్లు, ఈఈ పి.శ్రీనివాసులు, ఏడీఏ రవికుమార్, ఏఈ అంకబాబు, టీడీపీ నాయకులు ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీలు కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, డీసీ ప్రెసిడెంట్ కంచుమాటి శ్రీనివాసరావు, నాయకులు దేవినేని కోటి, జిల్లెలమూడి శ్రీనుచౌదరి, కొండవీటి సుబ్బారావు, యేసురత్నం, గజ్జల సుబ్బారెడ్డి, మేదరమెట్ల వెంకటరావు, ఇందూరి పిచ్చిరెడ్డి, దేవినేని కోటి, బేత కోటిరెడ్డి, సూర శేషిరెడ్డి, బేతపూడి రామరావు, బిజ్జం సుబ్బారెడ్డి, గూడాల సాంబిరెడ్డి, దిరిశాల శ్రీనివాసరావు, పాల శ్రీను, కాస అంజిరెడ్డి, నిడమానూరు శ్రీను, గుద్దేటి నారాయణరెడ్డి, ఏరేసి వెంకటేశ్వర్‌రెడ్డి, తాతపూడి తెల్లయ్య, ఐదు మండలాల టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.




7_7.qxd 1/17/2026 11:34 PM Page 1



## ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్‌కు 25 అర్జీలు

**సంతనూతలపాడు, జనవరి 17, ప్రభాతవార్త**



ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ కార్యాలయంలో శనివారం నాడు జరిగిన ప్రజా దర్బార్‌కు నియోజకవర్గ పరిధిలోని వివిద గ్రామాలకు సంబంధించి ప్రజల నుండి వివిధ సమస్యలపై 25 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్‌కు బాధితులు తమ సమస్యలపై వివరించి తదుపరి వినతి పత్రాలను అందజేశారు. ఇళ్ల స్థలాలు,గృహ నిర్మాణ అనుమతులు,రేషన్‌కార్డులు, కొత్త పెన్షన్లు తదితర వాటికి సంబంధించి ప్రజల నుండి అధికంగా అర్జీలు వచ్చినవి. కొన్ని సమస్యలపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అధికారులతో మాట్లాడి కొన్నింటిని అక్కడే పరిష్కరించారు.సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే అర్జీదారుల సమస్యలను పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు, మద్దిపాడు, మండలాల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు,ఉప్పుగుండూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 21న సంతనూతలపాడులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**సంతనూతలపాడు, జనవరి 17, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీ బుధవారం ఉదయం 10గంటల 30 నిమిషాలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ అధ్యక్షత వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు.ఈ సమావేశంలో పలురంగాల అభ్యున్నతిపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, వివిద రంగాల అధికాఉలు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు హాజరు కావాల్సిందిగా ఎంపీడీవో సురేష్‌బాబు కోరారు.

## పొగ మంచుతో నిండి చీకటిమయంగా మారిన రహదారి



**సంతనూతలపాడు, జనవరి 17, ప్రభాతవార్త**

ఓ పక్క చలి.. మరో పక్క పొగ మంచుతో ఒంగోలు - కర్నూలు రహదారి చీకటి మయంగా మారింది. ముఖ్యంగా ఉదయం వేళలో ఈ మార్గంలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. రహదారి కనిపించగా పగటి వేళలలో వాహనదారులు లైట్లు వేసుకొని పయనించాల్సి వస్తుంది. దీనికి తోడు ముమ్మర చలితో ప్రయాణం మరింత ఇబ్బందికరంగా తయారైంది. ఉదయం వేళలో 8 గంటల దాటినను మంచు ప్రభావం తగ్గడం లేదు. దీంతో ఒంగోలు- కర్నూలు రహదారిలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది.

## రమణయ్యకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఘన నివాళులు

**సంతనూతలపాడు, జనవరి 17, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని 41వ డివిజన్ అంబేద్కర్ కాలనీలో శనివారం నడు టీడీపీనేత కంకణాల రమణయ్యకు సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ ఘన నివాళులర్పించారు. రమణయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వివరం గోవిందు, 42డివిజన్ టీడీపీ అధ్యక్షులు మన్నం పోలయ్య, టీడీపీ నాయకులు దాసరి కోటేశ్వరరావు, కైలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొని రమణయ్యకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## నేడు ఎన్టీఆర్ వర్ధంతిలో భాగంగా మెగా రక్తదాన శిబిరం



**సంతనూతలపాడు, జనవరి 17, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల్లో భాగంగా ఈనెల 18వ తేదీ ఆదివారం ఉదయం మెగా రక్తదాన శిబిరం జరగనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు తెలిపారు. ఒంగోలు రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో శనివారం నాడు జరిగిన సమావేశంలో హరిబాబు మాట్లాడారు. మండలంలోని టీడీపీ అభిమానులు, నాయకులు కార్యకర్తలు ముఖ్యంగా ఎన్టీఆర్ స్ఫూర్తితో రక్తదానం చేయాల్సిందిగా ఆయన కోరారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు హరిబాబు పేర్కొన్నారు. అనంతరం అన్నదాన వేడుకలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు ఈ ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలకు తరలి రావాల్సిందిగా మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్‌బాబు, మండల టీఎన్‌టీయుసీ అధ్యక్షులు పావులూరి నారాయణస్వామి చౌదరి,ఎన్నెస్పీ నీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు నాదెళ్ల ఆంజనేయులు, నల్లగట్ల సుబ్బారావు, వేమా అంకంశెట్టి, మట్టా పోలిశెట్టి, దేవూరి హరి, ఏ.మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా మోడర్న్ కబడ్డీ పోటీలు

**సింగరాయకొండ, జనవరి 16, ప్రభాతవార్త**

ఆంధ్ర ప్రదేశ్ మోడర్న్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలుర జూనియర్ కాలేజీ లో జరుగుతున్న 3వ జాతీయ స్థాయి మోడర్న్ కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.రెండవ రోజు శనివారం కాలేజీ ఆవరణలో జరుగుతున్న మహిళలు, పురుషుల విభాగాల్లో ఉత్కంఠ భరితమైన మ్యాచ్‌లు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మోడర్న్ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ మాట్లాడుతూ మహిళల విభాగంలో ఆంధ్ర ప్రదేశ్, కేరళ, తెలంగాణ, మహారాష్ట్ర జట్లు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాయి.పురుషుల విభాగంలో తెలంగాణ, ఉత్తర్ ప్రదేశ్, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీ, ఓడిశా జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మోడర్న్ కబడ్డీ అసోసియేషన్ ఇండియా అధ్యక్షుడు ఆనంద్ సాహు,ప్రధాన కార్యదర్శి డా. కుంభం రాంరెడ్డి, ఖజానాదారు తడెం రవి, తెలంగాణ మోడర్న్ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆరే తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులకు ఆశీర్వాదం

**సీఎస్‌పురం, జనవరి 17, ప్రభాతవార్త**



సీఎస్‌పురం, పామూరు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త టీడీపీ నాయకులు పామూరు మండల ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ గౌస్ సోదరుడు రహిమాన్ కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుక శుక్రవారం సాయంకాలం అనిల్ గార్డెన్‌లో జరిగింది. వివాహ రిసెప్షన్ వేడుకకు టీడీపీ నాయకులు బోయల్ల నారాయణరెడ్డి,కోవిలంపాడు గ్రామ సర్పంచ్ ఖాదర్‌బి,బుజ్జి, పాత్రికేయులు రహిమాన్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆటోడ్రైవర్‌పై దాడి కేసులో నిందితులపై కఠిన చర్యలు

### - కనిగిరి డీఎస్పీ హెచ్చరిక

**పామూరు, జనవరి 17, ప్రభాతవార్త**



గుంటుపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చీమలదిన్నె మహర్షిపై దాడి చేసిన ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్ స్పష్టం చేశారు. విలేకర్లతో డీఎస్పీ మాట్లాడుతూ పీసీపల్లి మండలం గుంటుపల్లికి చెందిన మహర్షి ఆటోలో నిమ్మకాయల లోడుతో పామూరుకు వెళ్తుండగా శుక్రవారం సాయంత్రం బొట్లగూడూరు సెంటర్ వద్ద మోటారు సైకిల్ ఢీకొన్నట్లు భావించిన కొందరు వ్యక్తులు ఆటో అద్దాలు పగలగొట్టడమే కాకుండా, డ్రైవర్ మహర్షిని బయటకు లాగి విద్యుత్ స్తంభానికి కట్టేసి విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారని తెలిపారు. దాడిలో డ్రైవర్ గాయపడగా, ఫిర్యాదు మేరకు పామూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశామని డీఎస్పీ వెల్లడించారు. ముద్దాయిలైన కమ్మ ప్రసాద్,రేగలగడ్డ నాగేశ్వరరావు, దొడ్డ జి.హరికృష్ణ అలియాస్ బ్రహ్మకల, చిరుమామిళ్ళ వెంకటేశ్వర్లు, చల్ల శ్రీనివాసులు, కోటపాటి వెంకటేశ్వర్లు తదితరులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. చట్టాన్ని తన చేతిలోకి తీసుకున్న వారెవ్వరైనా కఠినచర్యలు తప్పవు. అవసరమైతే బైండోవర్,రౌడీ షీట్లు కూడా నమోదు చేస్తాం అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పామూరు సీఐ మాకినేని శ్రీనివాసరావు, ఎస్సై కట్టా అనూక్‌లు ఉన్నారు.

## శాఖవరంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**వలేటివారిపాలెం, జనవరి 17, ప్రభాతవార్త**

వలేటివారిపాలెం మండలం శాఖవరం గ్రామంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా ముగిశాయి. పండుగ వేడుకల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ యువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ట్రాక్టర్ రివర్స్ పోటీలు, మ్యూజికల్ చైర్స్ నిర్వహించారు. చివరిగా చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం బహుమతుల ప్రధానోత్స వ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుమారులు అవినాష్, సందీప్‌లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. వివిధ పోటీల్లో విజేతలకు వారు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శాఖవరం గ్రామం తెలుగుయువత, మహిళలు పాల్గొన్నారు.

## పోటేత్తిన భక్తులు

### - మాలకొండ ఆదాయం రూ.20,79,769



**వలేటివారిపాలెం, జనవరి 17, ప్రభాతవార్త**

మండలంలోని మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి రూ.20,79,769 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. అష్టోత్తరంకు రూ.14,350, కుంకుమార్చన కు రూ.29,360, వివాహములు రూ.1000, తలనీలాలు రూ.43,975,వాహనపూజలు రూ.5020, ప్రత్యేకదర్శనం రూ.6,60,800, స్థలపురాణం రూ.600,రూమ్ అద్దెలు రూ.22,020, కవర్లు రూ.10,925,లడ్డుప్రసాదం రూ.3,24,385, అన్నదానం రూ.8,76,870, విరాళాలు రూ.90,464 మొత్తం కలిపి రూ.20,79,769లక్షల ఆదాయం వచ్చినట్లు తెలియజేశారు.

## ఫేక్ లింకులను ఓపెన్ చేస్తే అకౌంట్ నుంచి డబ్బులు మాయం

**కొమరోలు, జనవరి 17, ప్రభాతవార్త**

ఈనెల 15వ తేదీ నుంచి వాట్సాప్ గ్రూపులలో నాకు 5వేల రూపాయలు వచ్చాయి, నేను నకిలీ అనుకున్నాను కానీ నాకు నిజంగా 5వేలు వచ్చాయి, కావాలంటే మీరు ట్రై చేయండి అంటూ కొన్ని ఫేక్ లింకులు వస్తున్నాయని, వీటిని నమ్మవద్దని కొమరోలు ఎస్సై జె నాగరాజు తెలిపారు. వాట్సప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్లలో ఫేక్ లింకులు విస్తృతంగా వైరల్ అవుతున్నట్లు పేర్కొన్నారు. అయితే ఇది సైబర్ నేరగాళ్ల మోసమని తెలియక చాలామంది లింకులను ఓపెన్ చేసే ప్రమాదం ఉందని, ఇలాంటి ఫేక్ లింకుల వల్ల బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులు కోల్పోవడం, మొబైల్ ఫోన్ హ్యాక్ అవడం, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అవటం, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకునే అవకాశం ఉందని, కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ మీ మొబైల్ వాట్సాప్ కు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు.

## విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు



**లింగసముద్రం, జనవరి 17, ప్రభాతవార్త**

లింగసముద్రంలో అక్రమ విద్యుత్ వాడకంపై విద్యుత్ విజిలెన్స్ అధికారులు శనివారం విస్తృతంగా తనిఖీలు. ఇందుకు సంబంధించిన వివరాలను మండల సహాయక ఇంజనీర్ ఎస్‌కే ఫిరోజ్ విలేకర్ల సమావేశం నిర్వహించి తెలియజేశారు. ప్రకాశం జిల్లా పర్యవేక్షణ ఇంజనీరు కట్టా వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల పరిధిలో 30 బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేపట్టి అనేక రకాల కేసులు నమోదు చేయడమే కాకుండా 83 మందికి రూ.5,50,500అపరాధ రుసుం విధించినట్లు మండల సహాయక ఇంజనీర్ ఎస్‌కే ఫిరోజ్ తెలిపారు. అధికారులు 74 మంది సిబ్బంది 31 బృందాలుగా ఏర్పడి విద్యుత్ సర్వీసులు తనిఖీ చేశారు. మీటర్లు ఉండి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 7 మందికి రూ1,15000, అనుమతి కన్న అధిక కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న 5 మందికి రూ.42000 అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుతున్న 71 మందికి రూ.3,59000 అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులు 9440812359, 9440812358 నంబర్లు ద్వారా పూర్తి సమాచారం నేరుగా గాని వాట్సప్ ద్వారా గాని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టి.హైమావతి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఆర్.విజయబాబు,డీఈ వీరయ్య, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు కందుకూరు ఆర్.విజయబాబు, డీఈఎఫ్‌లు వెంకటేశ్వర్లు, పి.యుగంధర్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**రాచర్ల, జనవరి 17,ప్రభాతవార్త**

మండలంలోని జెపిచెరువు అటవీ ప్రాంతంలో వెలసియున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ జిల్లా జడ్జి భూపాల్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య, సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. ఆలయ అర్చకులు ఆయన చేత ప్రత్యేకపూజలు చేయించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.సంక్రాంతి పండుగ సెలవులు కావడంతో స్వామివారిని దర్శించుకనేందుకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు సందర్భంగా ఆలయంలోని పలు సత్రాల్లో భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహించినట్లు ఆయా సత్రాల నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ నరసింహులు పాలక మండల సభ్యులు పాల్గొన్నారు.

## మాలకొండకు పోటేత్తిన భక్తులు - చేతులు ఎత్తేసిన అధికారులు

**కందుకూరు/వలేటివారిపాలెం,జనవరి 17,ప్రభాతవార్త**





మండలంలోని మాలకొండ నందలి శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంకు శనివారం భక్తులు పోటేత్తారు.సంక్రాంతి పండగ సందర్భంగా స్వగ్రామలకు వచ్చిన వారంతా మాలకొండకు రావడంతో రద్దీ ఎక్కువైంది. ఘాట్ రోడ్డంతా వాహనాల రాకపోకలతో నిండిపోయింది. సుమారు 15వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. తద్వారా రూ.20లక్షలకి పైగా స్వామివారికి ఆదాయం సమకూరింది. క్యూలు భక్తులతో నిండిపోయాయి.అన్నదాన మండపం గేట్ దగ్గర ఘర్షణ నెలకొంది.దీంతో అక్కడున్న సిబ్బంది చేతులెత్తేశారు.గేట్‌ను భక్తులే తోసేసిలోపలకు వెళ్లారు.ఉదయం 6గం॥ నుంచి సాయంకాలం 5.30వరకు భక్తుల రద్దీతోనే దర్శన కార్యక్రమం జరిగింది. దర్శనానికి సుమారు 3 నుంచి 4గం॥ సమయం పట్టింది.దీంతో క్యూలో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఆలయ కమీషనర్ చంద్రశేఖర్, అధికారులు కోనప్రసాద్,మోహనరావు, మధులు వేరువేరు ప్రాంతాలలో భక్తుల క్యూను అదుపు చేశారు. అయితే వీరికి సకాలంలో స్వామివారిదర్శనం అందలేదని భక్తులు ఆవేదన చెందారు.స్నానాలఘట్ట,కేశఖండనశాల,అన్నప్రసాదశాల తదితర ప్రాంతాలలో క్యూ అదుపుతప్పింది.గర్భగుడిలోకి త్వరగా వెళ్లెందుకు పలువురు భక్తులు నానా యాతన పడ్డారు.దాతలకు వినియోగించే ప్రత్యేక దర్శనమార్గం భక్తుల సమూహంతో కిక్కిరిసిపోయింది. దీంతో ఆలయ సిబ్బంది కొంతసేపు గేట్ మూసేశారు. దీంతో భక్తులు అడ్డదారులు తొక్కారు.ఆలయ సిబ్బందికి భక్తులకు మధ్య ఘర్షణ నెలకొంది. అదేవిధంగా అన్నదాన మండపం వద్ద క్యూ నిర్వహణ కష్టసాధ్యమైంది.భక్తులకు పోలీసులకు ఆలయ సిబ్బందికి మధ్య వాగ్వాదం నెలకొంది. ఆలయ జమాన్‌పై పలువురు చేయిచేసుకున్నట్లు సమాచారం.భక్తులు బలవంతంగా గేట్ తోసుకుంటూ అనేక మంది భోజనశాల ఆవరణలోకి ప్రవేశించారు.కంచె ఎక్కి దాటారు.దీంతో క్యూలో నిల్చొన్న వ్యక్తులు సిబ్బందిపై గొడవకు దిగారు.తమను కూడా పంపించమని వాగ్వాదం చేశారు.ఇకపోతే అన్నదాన శిబిరంలో రోజూ ఉండే 4వ తరగతి సిబ్బందిలేరు.వేలమందికి వడ్డించే కార్యక్రమంలో కేవలం 4గురే ఉండడంతో భోజనకార్యక్రమ నిర్వహణలో జాప్యం నెలకొంది. దీంతో భక్తులు ఆవేదన చెందారు. భక్తులకు అందించిన లడ్డుప్రసాదాలలోనాణ్యతా ప్రమాణాలు సన్నగిల్లాయని పలువురు భక్తులు తెలిపారు. సాయంకాలం 4గం॥లకు లడ్డు కౌంటర్ వద్ద పలువురు భక్తులు సిబ్బందితో గొడవకు దిగారు. దీనితో సిబ్బంది అధికారులును అడగమని బుకాయించారు.గత వారాలలో మిగిలిపోయిన లడ్లును అందించారని ఆరోపించారు.రకరకాల వాహనానలు భారీ సంఖ్యలో రావడంతో పార్కింగ్ కష్టసాధ్యమైంది, సుమారు 1కిమీపైగా రోడ్డుకి ఇరువైపుపార్కింగ్‌చేశారు.అయినా ఈ విషయంలో పోలీసులు పనితీరు అధ్వానంగా ఉంది.వాహనాలను పార్కింగునుంచి బయటికితీయడానికి ద్విచక్రవాహనదారులు నానా ఇబ్బందిపడ్డారు.

### పెరిగిపోయిన రేట్లు :

12అంగుళాల టెంకాయను రూ35అమ్మాల్సి ఉండగా కాయలను గ్రేడ్ చేసి రూ 50 నుంచి రూ.100లకు అమ్మారు. అదేవిధంగా షాపుల నిర్వహకులందరూ బొమ్మలు,తినుబండారాలు, వస్త్రాలు, కూల్ డ్రింక్స్ తదితర వస్తువులును అధికరేట్లుకు విక్రయించినట్లుపలువురు భక్తులు ఆరోపించారు.కే కశఖండనశాల,స్నానాల ఘట్టం వద్ద,మరియు లడ్డు కౌంటర్ వద్దగల స్వామిగుడి వద్ద పలువురు సిబ్బంది మామూళ్లు వసూలు చేశారు.

### జిల్లా జేసీగా నియమితులైన పులి శ్రీనివాసులును కలిసిన కొనకనమిట్ల తహశీల్దార్ సురేష్

**పొదిలి, జనవరి 17, ప్రభాతవార్త**




మార్కాపురం జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన పులి శ్రీనివాసులును కొనకనమిట్ల తహసీల్దార్ ఆవుల సురేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జేసీకి అభినందనలు తెలిపిన వీఆర్వోలు నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును వీఆర్వో సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు వైపి రంగయ్య, కార్యదర్శి జానయ్య, వీఆర్వోలు ఎంఎన్‌వి దిలీప్, కిలారి సుబ్బారావు, చలమారెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

## గొట్లుగట్టులో ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**పొదిలి, జనవరి 17, ప్రభాతవార్త**





సంక్రాంతి పండుగ సందర్భంగా గొట్లుగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శనివారంతో ముగిశాయి. ఫైనల్ పోటీల్లో గొట్లుగట్టు సెవెన్ స్టార్, రెడ్డెంవారిపల్లి, నాగంపల్లి, గొట్లుగట్టు శివాజీ టీములు తలపడగా గొట్లుగట్టు సెవెన్ స్టార్ టీమ్ మొదటి బహుమతి, రెడ్డెం వారిపల్లి టీమ్ రెండవ నాగంపల్లి టీమ్ మూడో, గొట్లుగట్టు శివాజీ టీమ్, నాలుగోబహుమతులు సాధించాయి. వీరికి మొదటి బహుమతి దాత పొదిలి రంజిత్ కుమార్ రూ.10వేలు అందించారు . రెండవ బహుమతిని రూ.7వేలును కాసు వెంకటేశ్వరరెడ్డి, చైర్మన్ కాసు చారిటబుల్ ట్రస్టు తరుపున అందించారు. మూడో బహుమతి రూ.5వేలను చినమనగుండం గ్రామానికి చెందిన పల్లపాటి కాంతారావు అందించారు. నాలుగో బహుమతి మూడు వేల రూపాయలను జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు అందించారు. ముందుగా ఫైనల్ పోటీలను దాతలు పోటీల నిర్వాహకులు ఎన్.వెంకటేశ్వర్లు, గుమ్మా శ్రీనివాసులు, గ్రామ పెద్దలు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. పోటీలను గొట్లగట్టు పరిసర ప్రాంత ప్రజలు తిలకించి క్రీడాకారులను ఉత్తేజపరిచారు.

## నేడు ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను విజయవంతం చేయండి

**లింగసముద్రం, జనవరి 17, ప్రభాతవార్త**

బడుగు బలహీన వర్గాల ప్రధాత విశ్వవిఖ్యాత నటసార్వభౌమ పేదలపాటి పెన్నిధి నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్బంగా లింగసముద్రం గ్రామంలో ఈనెల 18వ తేదీన సాయంత్రం 7గంటలకు లింగసముద్రంలో సెంటర్ కోటయ్య సమాధి దగ్గర సంతాప కార్యక్రమం కలదని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొనడం జరుగుతుందని, కావున మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, బీజేపీ పార్టీ నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరడమైందని అనంతరం అన్నదాన కార్యక్రమం కలదని లింగసముద్రం మండల కూటమి నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

8_8.qxd 1/17/2026 11:35 PM Page 1



# ఎమ్మెల్యే ఉగ్ర సహకారంతో మెరుగైన వైద్యం

**- మోజేష్‌ను పరామర్శించిన టీడీపీ నేతలు**



**కనిగిరి, జనవరి 17, ప్రభాతవార్త**

మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు, 150వ బూత్ ఇన్‌చార్జి కరాటపు మోజేష్‌ను తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం పరామర్శించారు. మోజేష్ గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి స్పందించి, ఆయనకు అమరావతి హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం అందేలా సహకారం అందించారు. చికిత్స అనంతరం కోలుకుని కనిగిరి చేరుకున్న మోజేష్‌ను టీడీపీ టౌన్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, ఇతర ముఖ్య నాయకులు ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి బుల్లాబాలబాబు,ఎస్సీ సెల్ అధ్యక్షులు మధుబాబు, 5వ వార్డు అధ్యక్షులు రామసుబ్బారెడ్డి, నాయకులు ప్రభుదాసు, నూకతోటి నారాయణ, నిలిశెట్టి అంజినాయుడు, డానియల్, పాతూరు నాగ యాదవ్, షేక్ జిలానీ, మోహన మురళి, ఆంటోని తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్ర స్ఫూర్తితో మెరిసిన యువత ప్రతిభ

**- ఉగ్ర టీ10 క్రికెట్ ఫైనల్లో జట్టు విజయం**



**కనిగిరి, జనవరి 17, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రేరణతో, కనిగిరి నియోజకవర్గ తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి డాక్టర్ ఉగ్ర టీ10 క్రికెట్ ఫైనల్ మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో ఎంఎస్‌ఆర్ జట్టు అతి కొద్ది తేడాతో అగ్రస్థానాన్ని సాధించి విజేతగా నిలిచింది. విజేతలకు మరియు రన్నరప్ జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దొడ్ల సురేష్‌రెడ్డి, కనిగిరి పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, ఒంగోలు పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి షరీఫ్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొని యువ క్రీడాకారులను అభినందించారు. యువతలో ఆరోగ్య చైతన్యం, క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు ఇలాంటి టోర్నీలు మరింతగా నిర్వహించాలని నాయకులు ఆకాంక్షించారు.

# అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయండి

**- మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఆదేశం**

**- వార్డు సమస్యలే లక్ష్యంగా మున్సిపల్ చైర్మన్ పర్యటనలో అధికారులకు కీలక సూచనలు**



**కనిగిరి, జనవరి 17, ప్రభాతవార్త**

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అసంపూర్తి పనులను తక్షణమే గుర్తించి, వాటిని పూర్తి చేయడం ద్వారా ప్రజల ఇబ్బందులను తొలగించాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అధికారులను ఆదేశించారు. శనివారం సమస్యల పరిష్కారం కార్యక్రమంలో భాగంగా ఆయన 5వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. వార్డు పర్యటనలో భాగంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వార్డులోని కొన్ని డ్రైనేజీ కాలువలు, కొత్తగా నిర్మించిన రోడ్లు సగంలోనే నిలిచిపోవడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ప్రజలు వాపోయారు. అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాల వల్ల అపరిశుభ్రత పెరగడమే కాకుండా, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఫిర్యాదులపై స్పందించిన చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ క్షేత్ర స్థాయిలో అసంపూర్తి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన రోడ్లు, కాలువలను సంబంధిత అధికారులు వెంటనే గుర్తించాలి. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలి. విధుల్లో వహించకుండా, బాధ్యతాయుతంగా పని చేస్తేనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుంది అన్నారు. ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో కౌన్సిలర్ దేవరాజ్, స్థానిక నాయకులు దావీదు, సారమ్మ, జార్జి, కోటయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సేవకు అంకితమైన తిమ్మయ్యకు టీడీపీ నేతల శ్రద్ధాంజలి



**కనిగిరి, జనవరి 17, ప్రభాతవార్త**

కనిగిరి 2వ వార్డు నాయకుడు జానపాటి తిమ్మయ్య మరణం పట్ల తెలుగుదేశం పార్టీ నేతలు సంతాపం వ్యక్తంచేశారు.కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తిమ్మయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శిస్తూ టీడీపీ టౌన్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, 2వ వార్డు అధ్యక్షుడు పచ్చవ శేఖర్, టీడీపీ నాయకులు అంజి, జిలానీ, మురళి, నాగ పాతూరును కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తిమ్మయ్య పార్టీకి, ప్రజలకు అంకితభావంతో పని చేసిన నాయకుడని నేతలు పేర్కొన్నారు. ఉన్నతమైన సేవలు అందించిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమని ఆయన కుటుంబానికి ధైర్యం కలగాలని ప్రార్థించారు.

# అక్షర సేద్యం - మేథస్సుకు నిదర్శనం

**కనిగిరి, జనవరి 17, ప్రభాతవార్త**

కనిగిరి సీమలో విరిసిన విజ్ఞాన వీచిక పేద విద్యార్థుల కలలకు ఈ ఫౌండేషన్ ఒక వేదిక శ్యామల వెంకటరెడ్డి ఆశయాల బాటలో సాగుతోంది పద్నాలుగో టాలెంట్ టెస్టు ప్రభంజనంలా..! పుస్తకమే ఆయుధంగా.. ప్రతిభే ప్రాణంగా పదవ తరగతి చదువుతున్న పసి మొగ్గలకు కష్టపడి చదివే కన్నబిడ్డల ఉన్నత చదువులకు ఆసరాగా నిలుస్తోంది ఈ అక్షర సేద్యం..! మొదటి ర్యాంకు సాధిస్తే మది నిండా ఉత్సాహం.వేల రూపాయల బహుమతి విద్యార్థికి ప్రోత్సాహం. మండల స్థాయిలోనూ ఇప్పుడు ప్రోత్సాహ బహుమతుల హేల.. జ్ఞానాన్ని పెంచే ఈ పరీక్ష. ఒక విద్యా పండుగ వేళ..! శ్యామల వెంకటరెడ్డి ఆశయానికి శ్యామల కాశిరెడ్డి వారధిగా నిరుపేద మేధావులకు నిలుస్తున్నారు సారథిగా చదువును ప్రోత్సహిద్దాం..దేశాన్ని అభివృద్ధి చేద్దాంఈ మహాయజ్ఞంలో అందరం భాగస్వాములవుదాం..!

## విద్యుత్ చార్జీల టారిఫ్ పై 20 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

**అద్దంకి , జనవరి 17, ప్రభాతవార్త**

విద్యుత్ చార్జీల టారిఫ్ పై ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ( ఏపీఈఆర్సి ) ఈనెల 20 నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు అద్దంకి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నల్లూరి మస్తాన్ రావు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఏపీఈఆర్సి ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని తిరుపతి, విజయవాడ, కర్నూల్ నుండి నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సంస్థలు ఏపీఈఆర్సికి సమర్పించిన వార్షిక ఆదాయ , అవసరాల నివేదికపై 20వ తేదీన తిరుపతిలో, 22 ,23 తేదీల్లో విజయవాడ, 27న కర్నూల్‌లో రోజు ఉదయం 10.30 నుండి ఒంటిగంట వరకు, రెండు గంటల నుండి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు జరుగుతాయి అన్నారు. ఏపీఈఆర్సి అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ ఏపీ ట్రాన్స్కో, ఏపీ జెన్కో, ఏపీ సిపిడిసిఎల్, ఏపీ ఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రతిరోజు మూడు విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందిన టారిఫ్ ఫైలింగ్ మీద ప్రజాభిప్రాయాలను స్వీకరిస్తారని వివరించారు. అద్దంకి డివిజన్ కు సంబంధించి అభిప్రాయాలు చెప్పదలుచుకున్న వారికి అద్దంకి డివిజన్ కార్యాలయం నందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.అభిప్రాయాలు తెలియజేయాలి అనుకున్నవారు ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు పేర్లు నమోదు చేసుకొని వారు కూడా విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో అభిప్రాయాలు తెలియజేయవచ్చు అన్నారు ప్రజలు వీక్షించేందుకు వీలుగా అద్దంకి డివిజన్ కార్యాలయము ప్రత్యక్ష ప్రసారం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు నల్లూరి మస్తాన్ రావు తెలిపారు.

# కృష్ణమూర్తికి చింతలపూడి నివాళి



**కొరిసపాడు ,జనవరి 17,ప్రభాతవార్త**

మండలంలోని పి.గుడిపాడు గ్రామం నందు రోడ్డు ప్రమాదంలో మరణించిన సర్పంచ్ తాడి కృష్ణమూర్తి, మాతృమూర్తి, వారి సోదరుడి భౌతికకాయాలకు అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ నివాళులర్పించి, అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట కొరిశపాడు మండల వైఎస్ఆర్సీపీ కన్వీనర్ పాలపర్తి శ్రీధర్(చిట్టి),స్థానిక వైఎస్ఆర్సీపీ నాయకులు ఉన్నారు.

# గోపాలపురం వద్ద కారు బోల్తా

**- ఇరువురికి గాయాలు**





**అద్దంకి , జనవరి 17,ప్రభాతవార్త**

మండలంలోని గోపాలపురం స్పీడ్ బ్రేకర్ల వద్ద పొదిలి నుంచి నరసరావుపేట వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో దుర్గాప్రసాద్, భార్య మల్లీశ్వరి, తల్లి పార్వతి, కుమారుడు నటరాజ్, కుమార్తె శివాని గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.

# ఎన్టీఆర్ 30వర్ధంతికి - భారీగా తరలిరండి



**కందుకూరు జనవరి 17, ప్రభాతవార్త**

దివంగత ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ 30 వ వర్ధంతి కార్యక్రమంను ఈ నెల 18న కందుకూరు పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9గం॥లకు ఎన్టీర్ విగ్రహానికి నివాళులు అర్పించనున్నారు.10 గం॥లకు వెంగమాంబ ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం,10:30 గంటలకు వర్ధంతి సభ, మధ్యాహ్నం 12గం॥లకు అన్నదానం కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

**నూతన జేసీగా నియమితులైన పులి శ్రీనివాసులును కలిసిన పొదిలి తహసీల్దార్ కృష్ణారెడ్డి**



**పొదిలి, జనవరి 17, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన పులి శ్రీనివాసులును పొదిలి తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. వీరితో పాటు వీఆర్వో కిలారి సుబ్బారావు ఉన్నారు.

# ముగిసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

**- బహుమతులు అందజేసిన దాతలు**



**పొదిలి, జనవరి 17, ప్రభాతవార్త**

పొదిలి ప్రభుత్వ కళాశాల మైదానం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శనివారంతో ముగిశాయి. పది రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలో మొదటి బహుమతి ఎన్‌బీ లెవెన్స్ విజయం సాధించింది. మొదటి బహుమతి ధాత రూ.30,116, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్(పండు) చేతుల మీదుగా అందజేశారు. ఎస్ఎస్ లెవెన్స్‌కు రెండవ బహుమతి ధాత రూ.20,116 వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సయ్యద్ ఇమాంసాచేతుల మీదుగా అందజేశారు. మూడవ బహుమతి రూ.10,116 ఫైటర్ లెవెన్స్‌కు మాజీ పొదిలి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మీగడ ఓబుల్‌రెడ్డి అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో రాణించిన (మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్) ఎస్కే నజీర్‌కి రూ.1,116 మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అందించారు. క్రికెట్ పోటీలో మొదటి మ్యాచ్ నుండి చివరి మ్యాచ్ వరకు రాణించిన( మ్యాన్ ఆఫ్ ది సిరీస్) నారాయణ స్వామికి రూ.2,116 మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ గ్రౌండ్ మెయింటినెన్స్‌కి డాక్టర్ స్వర్ణ గీత కుమారుడు స్వర్ణ ప్రీతం తన వంతు ఆర్థిక సహాయం అందించారు. టెంట్ హౌస్ మెయింటెనెన్స్‌కి పొదిలి పట్టణ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ మౌలాలి, వాకా వెంకట్‌రెడ్డి తన వంతు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ నాయకులు ముల్లా రబ్బాని, వరకుంట్ల నిరంజన్, టీడీపీ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

**- ఈఈ ఉమాకాంత్**

**కనిగిరి, జనవరి 17 ,ప్రభాతవార్త**

2026- 27 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ టారిఫ్‌లను నిర్ణయించేందుకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమీషన్(ఏపీఈఆర్సి) రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు కనిగిరి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.ఉమాకాంత్ తెలిపారు. ఈనెల 20వ తేదీన తిరుపతి, 22, 23వ తేదీల్లో విజయవాడ, 27వ తేదీ కర్నూలు కేంద్రాల్లో ఉదయం 1030గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు ప్రత్యక్షంగా, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. కనిగిరి డివిజన్ పరిధిలోని వినియోగదారులు తమ స్థానిక విద్యుత్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమంలో పాల్గొని తమ అభిప్రాయాలు నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అభిప్రాయాలను ఏపీఈఆర్సీ అధికారిక వెబ్‌సైట్‌లోనూ అప్లోడ్ చేసుకోవచ్చని, ప్రత్యక్షంగా సమావేశంలో మాట్లాడదలచిన వినియోగదారులు ముందస్తుగా కమీషన్ సెక్రటరీ వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఉమాకాంత్ సూచించారు. వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించి తమ అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు.

# నిబద్ధతకు నిదర్శనం తిమ్మయ్య

**- తిమ్మయ్య పార్థివ దేహానికి నివాళులర్పించిన చైర్మన్ అబ్దుల్ గఫార్**



**కనిగిరి, జనవరి 17, ప్రభాతవార్త**

కనిగిరి శివనగర్ కాలనీకి సంబంధించిన ప్రజా నాయకుడు జనపటి తిమ్మయ్య మరణం పట్ల మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తీవ్ర సానుభూతి వ్యక్తం చేశారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తిమ్మయ్య చనిపోయిన సందర్భంగా చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ శివనగర్ కాలనీ ఏర్పాటులో నుంచి పేద ప్రజలకు అండగా నిలిచి అనేక ప్రజా సమస్యలను పరిష్కరించిన తిమ్మయ్య నిజమైన నిబద్ధత గల నాయకుడు. ఆయన మరణం ప్రాంతానికి పెద్ద లోటు అని పేర్కొన్నారు. తిమ్మయ్య సేవలను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పంచాయతీ సభ్యుడు షేక్ షరీఫ్, నేతలు రాజా, షాహిద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లాకు నూతన జాయింట్ కలెక్టర్

**- బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల హాజరు**



**మార్కాపురం, జనవరి 17, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా పి శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించి, నూతన జాయింట్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంలో అధికార యంత్రాంగం కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఆర్డీవో ఒబులేసు, మార్కాపురం ఎమ్మార్వో కే చిరంజీవితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నంది విగ్రహ ధ్వంసం ఘటనలో దోషులకు కఠిన శిక్షలు విధించాలి



**మార్కాపురం, జనవరి 17, ప్రభాతవార్త**

తర్లుపాడు మండలం జగన్నాధపురం గ్రామంలోని వీరభద్ర స్వామి దేవాలయంలో పవిత్ర నందీశ్వరుడి విగ్రహాన్ని ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసిన ఘటనపై దోషులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మార్కాపురం జిల్లా ఎస్పీ కార్యాలయంలో బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులు తీవ్రంగా కలవరపెట్టే విషయమని పేర్కొన్నారు. సంబంధిత చట్టాల ప్రకారం వెంటనే కేసు నమోదు చేసి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హిందూ దేవాలయాలకు శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మార్కాపురం అసెంబ్లీ నాయకులు పివి కృష్ణారావు, శాసనాల సరోజిని, మద్దెల లక్ష్మీదేవి, అల్లేకుల సుబ్బారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దేశ బాషలందు తెలుగు లెస్స అని చాటిన మహానుభావులు శ్రీకృష్ణదేవరాయలు : పి ఎల్ పి యాదవ్



**మార్కాపురం, జనవరి 17, ప్రభాతవార్త**

విజయనగర సామ్రాజ్యాధిపతి, యాదవ కుల శ్రేష్ఠుడు శ్రీకృష్ణదేవరాయల జయంతిని మార్కాపురం జిల్లా అఖిలభారత యాదవ మహాసంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.సభలో జాతీయ నాయకులు పిఎల్‌పి యాదవ్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు దేశభాషలందు తెలుగు లెస్స అని చాటిన మహానుభావుడని, విజయనగర సామ్రాజ్యాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లిన శక్తివంతమైన హిందూ పాలకుడని కొనియాడారు. ఆయన సాహిత్య పోషణ వలనే ఆంధ్రభోజ అనే బిరుదు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాటమరాజు దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, ఒంటేరు నాగేశ్వరరావు యాదవ్, అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్, కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్, కడియం అల్లూరయ్య యాదవ్, పిన్నిక చక్రపాణి యాదవ్, తాళ్ల అల్లూరి కుమార్ యాదవ్, డా పొట్టెళ్ల శ్రీకాంత్ యాదవ్, బాల ఆంజనేయులు యాదవ్, గోసు సుబ్బారావు యాదవ్ తదితరులు పాల్గొని జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాటమరాజు గంగాభవాని దేవస్థానం కమిటీ ప్రతినిధులు, యాదవ సంఘ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుంత

**- అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికుల భద్రతకు ముప్పు**



**మార్కాపురం, జనవరి 17, ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నెలల తరబడి భారీ గుంత ఏర్పడి ఉన్నా,సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లాలంటే తప్పనిసరిగా ఆ గుంతలో దిగాల్సిన పరిస్థితి నెలకొంది. రోజూ వందలాది ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో గుంత వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. ప్రయాణికులు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఆర్టీసీ అధికారులు గానీ, ఇతర సంబంధిత శాఖల అధికారులు గానీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బస్టాండ్ బయట ఉన్న గుంతను వెంటనే పూడ్చి, ప్రమాదాలను నివారించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## నూతన జిల్లా హోదాలో తొలి గణతంత్ర వేడుకలకు సన్నాహాలు

**- పెరేడ్ ప్రాంగణం పరిశీలించిన జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు**



**మార్కాపురం, జనవరి 17,ప్రభాతవార్త**

నూతన జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణంలో ఈ నెల 26వ తేదీన జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు ముమ్మరం చేసింది. ఈ సందర్భంగా స్థానిక ఎస్వికెపి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న పెరేడ్ ప్రాంగణాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. ఈ పరిశీలనలో సబ్ కలెక్టర్ శివ రామిరెడ్డి, డీఎస్పీ డాక్టర్ యు నాగరాజు, మండల తహసిల్దార్ కె చిరంజీవి, సీఐ పి సుబ్బారావు తదితర అధికారులు పాల్గొన్నారు. పరేడ్ ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, భద్రతా చర్యలు, అధికారుల కూర్చునే ఏర్పాట్లు, ప్రజలకు సౌకర్యాలు వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా సమీక్షించారు. ఈ రోజు నూతన మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా నిర్వహించనున్న జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలు కావడంతో, వాటిని మరింత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని పి శ్రీనివాసులు అధికారులకు సూచించారు. జిల్లా గా అవతరించిన తర్వాత తొలి గణతంత్ర వేడుకలు కావడం గర్వకారణమని, అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో దేశభక్తి భావాలు ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించాలని సూచిస్తూ, అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## నేడు కంభంలో ఫైనల్ మ్యాచ్

**- బహుమతుల ప్రధానోత్సవానికి హాజరు కానున్న ప్రముఖులు**

**కంభం, జనవరి 17 ,ప్రభాతవార్త**

కంభంలో గత 12 రోజులుగా జరుగుతున్న నందమూరి తారక రామారావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో నేడు ఆదివారం జరగనున్న ఫైనల్ మ్యాచ్‌కు విజేతలకు బహుమతులు అందించడానికి ముఖ్య అతిథులుగా ముగ్గురు టిడిపి శాసనసభ్యులు హాజరవుతున్నట్లు నిర్వాహకులు కేతం శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఫైనల్ మ్యాచ్‌లో మార్కాపురం,బేస్తవారిపేట జట్లు తలపడనున్నాయని తెలిపారు.ఇందులో రన్నర్స్,విన్నర్స్‌లకు బహుమతులు అందించడానికి జిల్లా టిడిపి అధ్యక్షులు మరియు కనిగిరి శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి,ఎర్రగొండ పాలెం టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు.

# దేవాలయ పునర్ నిర్మాణానికి లక్ష విరాళం

**కొరిసపాడు, జనవరి 17,ప్రభాతవార్త**

మండలంలోని అనమనమూరు గ్రామంలో వేంచేసి ఉన్న అంకమ్మ తల్లి దేవాలయం పునర్ నిర్మాణ పనులు గత కొంతకాలంగా జరుగుతున్న విషయం పాఠకులకు విధితమే. ఈ నిర్మాణ పనులకు గ్రామస్తులే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు కూడా విరాళాలు ఇస్తున్నారు. శనివారం గ్రామానికి చెందిన రంపతోటి సునీల్ కుమార్ తన కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకుని, లక్ష రూపాయల నగదును విరాళంగా గ్రామ సర్పంచ్ జంపు హరిబాబుకు అందజేశారు.



